క్లుప్తంగా

రాజన్న క్యాంటీన్‌లో వెయ్యి మందికి భోజనం



జగ్గయ్యపేట: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రాజన్న ఉచిత క్యాంటీన్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత భోజనానికి పట్టణానికి వచ్చిన పలువురు నిరుపేదలు, తదితరులు పెద్ద సంఖ్యలో ఆకలితీర్చుకుంటున్నారు. మంగళవారంతో 63వ రోజుకు చేరుకుంది. రోజు విడిచి రోజు శాఖాహారంతో పాటు మాంసాహారం కూడా క్యాంటీన్‌లో అందిస్తుండటంతో రాజన్న క్యాంటీన్ నిర్వహణపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

చౌటపల్లి(వీరులపాడు): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా రీ సర్వే నిర్వహిస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో పలువురు రైతులకు మంగళవారం ఆమె భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూముల రీ సర్వేతో భూముల సరిహద్దు సమస్యలకు తక్షణ పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, చలమాల దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు పల్లెపోగు మార్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్‌కోట రామా రావు, వైద్యాధికారి గౌతమ్ పాల్గొన్నారు.

నిరంతరంగా తాగునీటి సరఫరా

కంచికచర్ల(వీరులపాడు): ప్రజలకు సురక్షితమైన తాగునీటిని నిరంతరం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి రక్షిత మంచి నీటి పథకం పైప్‌లైన్ మరమ్మతు పనులను మంగళవారం యుద్ధప్రాతిపదికన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా నిరంతరం మంచి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులకు గురవటంతో మూడు రోజులుగా సక్రమంగా తాగునీటిని సరఫరా చేయలేకపోయామని మరమ్మతుల అనంతరం తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయి

చాట్రాయి: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చనుబండ, కృష్ణారావుపాలెం, బూరుగుగూడెం గ్రామ పంచాయతీల్లో మంగళవారం నిర్వహించిన పారిశుద్ధ్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వ్యక్తికీ రోజుకు 55 లీటర్లు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు దేశిరెడ్డి హైమావతి, విస్సంపల్లి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ పాలనకు నూకలు చెల్లాయి

నందిగామ: కేంద్రంలో బీజేపీ పాలనకు నూకలు చెల్లాయని సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. గతేడాది కేంద్ర రక్షణ సహాయ మంత్రి కుమారుడు చేసిన చర్యలకు నిరసనగా దేశ వ్యాప్త పిలుపు నేపథ్యంలో మంగళవారం బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్మికులతో కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ కేంద్ర రక్షణ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు కారుతో ఢీ కొట్టించి నలుగురి చంపిన విషయం దేశ ప్రజలు మర్చిపోలేదన్నారు. ఇంత జరిగినా కూడా సంబంధిత మంత్రిపై కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

మిక్‌లో కార్యశాల ప్రారంభం

కంచికచర్ల(వీరులపాడు): కంచికచర్ల మిక్ కళాశాలలో ఈసీఈ చివరి ఏడాది విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించనున్న కార్యశాల ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ వంశీ కిరణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ విజన్, ఐఓటీ విత్ పైథాన్ ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు కార్యశాల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను ఎస్‌హెచ్, ఐసొల్యూషన్స్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, పాండురంగారావు, సుహాస్, పుల్లారావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు ఉదయభాను, జగన్‌మోహనరావు
- అట్టహాసంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం



బండిపాలెంలో రోగులతో మాట్లాడుతున్న విప్ ఉదయభాను, అధికారులు



చౌటపల్లి సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

బండిపాలెం(జగ్గయ్యపేట): నిరుపేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించటమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో భూచవరం ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎంహెచ్‌వో సుహాసినితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఉన్నత ఆశయంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దనే వైద్యం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గత ప్రభుత్వాలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించకపోవటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కూడా సక్రమంగా ఉండేవి కావని తెలిపారు. కానీ నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. గతంలో రోగులు వైద్యశాలలకు వెళ్లే వారని కానీ నేడు వైద్యులే ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందిస్తుండటం ప్రభుత్వ పని తీరుకు నిదర్శనమని తెలిపారు. అనంతరం రోగులను అడిగి వివరాలు తెలుసుకుని మందులు పరిశీలించారు. 467 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్, ప్రవంతి, కీర్తి రెడ్డి, సొసైటీ చైర్మన్ కాసరగడ్డ రామారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో రమేష్‌బాబు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మెరుగైన ఉచిత వైద్యమందించటమే లక్ష్యం

చౌటపల్లి(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్యమందించటమే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా ఉండేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ద్వారా విషయాన్ని తెలుసుకుని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులలో సైతం ఉచిత వైద్యం అందించారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తీసుకురావటంతో పాటు 2,600లకు పైగా వ్యాధులకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులలో ఉచిత వైద్యం అందిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో రోగులు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకునే వారని కానీ ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా వైద్యులే ఇంటింటి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకుని వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యుడు పల్లెపోగు మార్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్ కోట రామారావు, వైద్యాధికారి గౌతమ్ పాల్గొన్నారు.

కంచికచర్లలో..

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మధురిమ తెలిపారు. మండలంలోని గనిఆత్కూరు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మెరుగైన ఉచిత వైద్యమందించేందుకే జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

నందిగామ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రతి గడపకు వెళ్లేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సిబ్బందికి సూచించారు. పట్టణ పరిధిలో ఈ నెల 5 వ తేదీన జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి పలు శాఖల సిబ్బందితో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏమైనా అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి శిబిరాలలో అవసరమైన అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని చెప్పారు. పలు స్థాయిల ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం

చిట్టేల(వత్సవాయి): ప్రజల చెంతకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సచివాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యాన్ని పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంప్‌ల ద్వారా బీపీ, సుగర్, కిడ్నీ, రక్త పరీక్షలు వంటివి పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తారని చెప్పారు. ఈ క్యాంపుల్లో 60 రకాల పరీక్షలతో పాటు 130 రకాల మందులను అందిస్తున్నామన్నారు. రోగి అనుమతితో ప్రైవేట్ వైద్యశాలల్లో కూడా చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్లెళ్ల అమ్మిరెడ్డి, సత్యనారాయణరెడ్డి స్మారక ట్రస్ట్ చైర్మన్ మార్లెళ్ల పుల్లారెడ్డి, సర్పంచ్ జాల పెద్దకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సువర్ణాధ్యాయానికి నాంది



పల్లగిరిలో శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: నిరుపేదలకు అందని ద్రాక్షలా ఉన్న మెరుగైన వైద్యాన్ని గ్రామాలలోని ఇంటి వద్దనే ఉచితంగా అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త సువర్ణ అధ్యాయానికి నాంది పలికారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో, చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించటమే కాకుండా వైద్య విద్యను సైతం నిరుపేదలకు చేరువ చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో భాగంగా గ్రామాలలోని ఇంటింటికీ వెళ్లి వైద్యాధికారులు ఉచిత వైద్యమందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆశయానికి అనుగుణంగా వైద్యాధికారులు, సిబ్బంది ముందుకు సాగాలని కోరారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, ఉప సర్పంచ్ చిలుకూరి బుచ్చిరెడ్డి, నందిగామ తహసీల్దార్ నరసింహారావు, ఎంపీటీసీ సభ్యుడు పెరమసాని నరసింహారావు, సీహెచ్‌వో పల్లె వర్షిణి, వైద్యాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు శనగపాడులో..

శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని శనగపాడు గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ చెప్పారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నందిగామలో అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో విప్ ఉదయభాను



నూతన లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ప్రజాప్రతినిధులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. ఇచ్చిన మాట మేరకు పింఛన్ మొత్తాన్ని పెంచుతూ సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయంతో ఎందరికో ప్రయోజనం చేకూరుతుందన్నారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇవ్వటం లేదన్నారు. ఎక్కువ సంఖ్యలో పింఛన్లు, ఎక్కువ మొత్తంలోనూ పింఛన్ ఇస్తున్న జగనన్న ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించి చిత్తశుద్ధి చాటుకున్నారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన సొంత లాభాపేక్షలు చూసుకున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణంలో ఠంఛన్‌గా పింఛన్..



పేటలోని 5వ వార్డులో పెన్షన్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లో పెన్షన్ల పంపిణీ జోరుగా జరుగుతుంది. మంగళవారం ఉదయం నుంచే వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు నిర్వహించారు. పట్టణంలోని 31 వార్డుల్లో ఉన్న వివిధ రకాల పెన్షన్లకు సంబంధించి పింఛన్‌దారులకు వార్డు వలంటీర్లు బయోమెట్రిక్ వేలిముద్రలు, ఐరిష్, ఫేషియల్ ద్వారా పింఛన్ నగదును అందజేశారు. పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలోని 31 వార్డుల్లో మొత్తం 5.017 మంది పింఛన్‌దారులకు గాను మూడు రోజుల్లో కలిపి 91.78 శాతం మందికి రూ.1,28,56,500 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు.

గడప గడపతో ప్రజా సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కోనాయపాలెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామటౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవటంతో పాటు వాటిని పరిష్కరించే వీలు కలుగుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు.

రానున్న ఎన్నికల్లో భారీ విజయం..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎంత వరకు మంచి చేయగలమో అంతకు మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేస్తున్నారని తెలిపారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో భారీ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుగ్గినేని సురేష్, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, బ్యాంకు ప్రసాద్, పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

- ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ ఉదయభాను



పేటలోని 21వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: గ్రామ, వార్డు సచివాలయం, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని 21వ వార్డులోని అలాసపురివారి వీధి, జెండా చెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి కుటుంబానికీ రూ.లక్షల్లో లబ్ధి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను గడప గడపకూ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను అందజేశారు. ఏదైనా పథకం వర్తించలేదని, అందటం లేదని ప్రజలు చెపితే ఎందుకు ఆ పథకం వర్తించలేదో, రావడం లేదో సంబంధిత అధికారులతో వివరణ ఇప్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికీ కనీసం రూ.లక్ష నుంచి 10 లక్షల వరకు లబ్ధి పొందుతున్నారన్నారు. గత చంద్రబాబు పాలనలో ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీ అమలు చేయక నమ్మక ద్రోహం చేయగా, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల గడప వద్దకే నేరుగా, ఎమ్మెల్యే, అధికారులను పంపి వారి సమస్యలను పరిష్కరిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, స్థానిక నాయకులు సోమవరపు బాబు, అలాసపురి సత్యనారాయణ, అలాసపురి వెంకటేశ్వరరావు, తిరుమలరావు, పెద్దాపురపు సుధీర్‌కుమార్, నోముల కృష్ణప్రసాద్, వేముల శేషు, ముత్యాల కౌశిక్, షేక్ లాలూ, మంగళగిరి ముత్యం, ముత్యాల నవీన్, రాజేష్, షేక్ నౌమన్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న వైద్యాధికారి అనిల్, వేదికపై సర్పంచ్ నర్సయ్య తదితరులు

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని పశు వైద్యాధికారి పి.అనిల్ అన్నారు. గ్రామంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై తోటచర్ల, వెంకటాపురం, కె.పొన్నవరం, సుబ్బాయిగూడెం, కొల్లికూళ్ల గ్రామాలకు చెందిన పాడిరైతులు, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలకు మంగళవారం రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాలవెల్లువలో భాగంగా మహిళలు పాడిగేదెలు తీసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలన్నారు. ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్, పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలు మరింత వృద్ధి సాధించాలనే లక్ష్యంతో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా గేదెలను బ్యాంక్ రుణాల ద్వారా ఇప్పించటంతో పాటు, మార్కెట్ సదుపాయాలు కూడా కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పాలు పోసిన మహిళలకు అమూల్ సంస్థ ద్వారా గిట్టుబాటు ధర అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ కూచి నర్సయ్య, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, తోటచర్ల గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కునగుంట్ల కోటేశ్వరరావు, ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాల వెల్లువపై అవగాహన సదస్సు

బండిపాలెం(జగ్గయ్యపేట): పాడి పరిశ్రమను ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో జగనన్న పాల వెల్లువపై మహిళలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రవేశపెట్టిందన్నారు. పాడి గేదెలు కొనుగోలు చేసుకునేందుకు సహకార బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారుని అర్హతను బట్టి రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళా పాడి రైతులు పాలను జగనన్న పాల వెల్లువ ద్వారా విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు మురళీకృష్ణ, లక్ష్మణరావు, కెడీసీసీ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉష తదితరులు పాల్గొన్నారు.

బైబై బొజ్జ గణపయ్యా..



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహ నిమజ్జనం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఊరేగించి సమీపంలోని మున్నేరు ఉపనదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ ట్రాఫికింగ్‌తో అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని ప్రజ్వల సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ వై చంద్రయ్య తెలిపారు. మైలవరం డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ హాలులో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఎన్టీఆర్ జిల్లా మైలవరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై మంగళవారం అవగాహనా సదస్సు జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 26 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఇప్పటి వరకు 27 వేల మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణా వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కలిప్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. చట్టాలు శిక్షలు, ప్రభుత్వ పథకాలు గురించి మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098(112), 100, 1930, సైబర్ ట్రాఫికింగ్ గురించి తెలియజేసినట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మహిళలు, విద్యార్థులు, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ శ్రావ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటరత్నం పాల్గొన్నారు.

రేపటి నుంచి పట్టణంలో జగనన్న సురక్ష క్యాంప్‌లు

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు ఈ నెల 5వ తేదీ నుంచి పట్టణంలో ప్రారంభమవుతాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 5వ తేదీన 1 నుంచి 7 వ సచివాలయ పరిధికి సంబంధించి తొర్రగుంటపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, 10వ తేదీన 8 నుంచి 14 వ సచివాలయ పరిధిలో ప్రాంతాల వారికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి మున్సి పల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. క్యాంపులో నిర్వహించాల్సిన విధి విధానాలను సిబ్బందికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమం ద్వారా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సంబంధించిన వలంటీర్, హెల్త్ సెక్రటరీ, ఆశావర్కర్, గృహసారథుల ద్వారా వారి ఆరోగ్య సమస్యలను నమోదు చేయించుకున్న వారు, లేదా చేయించుకోవాల్సిన వారు జగన్న ఆరోగ్య సురక్ష క్యాంపునకు హాజరుకావల్సిందిగా కోరారు. ఈ క్యాంపులో ప్రత్యేక వైద్య నిపుణులచే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. పట్టణ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.